క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

మామిడికుదురు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు నేతలు సోమవారం నిరసన తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఎస్సీ వర్గీకరణను తక్షణం రద్దు చేయాలని నినాదాలు చేశారు. దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలన్నారు. సుప్రీంకోర్టు సూచన మేరకు వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై మండల రెవెన్యూ కార్యాలయంలోనూ, నగరం పోలీస్ స్టేషన్, మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు. ముందుగా బస్టాండ్ కూడలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు, కొల్లాబత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ సన్నిధిలో చీఫ్ ఇంజినీర్ రామ్మూర్తి

మామిడికుదురు: విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ రామ్మూర్తి కుటుంబ సమేతంగా సోమవారం అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన పేరిట స్వామి వారికి పూజలు జరిపించారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో చిన్నారులను సత్కరించిన కమిటీ సభ్యులు

రాజోలు: దసరా ఉత్సవాల్లో భాగంగా శివకోటి కందికట్టు వారి శ్రీకనకదుర్గ ఆలయం వద్ద సోమవారం చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులు ఉండ్రు హస్నప్రియ, మేడిచర్ల నందిని, నంబు శ్రావ్యశ్రీలు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన చేశారు. చిన్నారులను కమిటీ సభ్యులు జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.

వరదతో అంత్యక్రియలకు ఇబ్బంది

అయినవిల్లి: ముక్తేశ్వరం వృద్ధగౌతమి (తొగరపాయ) వద్ద అంత్యక్రియలు నిర్వహిస్తే వారికి స్వర్గప్రాప్తి లభిస్తుందని ఇక్కడి స్థానికుల నమ్మకం. అందుకే ఈ ప్రాంతానికి చెందిన వారు మరణిస్తే ఎంత దూరంలో ఉన్నా ముక్తేశ్వరం స్మశాన వాటిక వద్దకు తీసుకొచ్చి అంత్యక్రియలు జరుపుతారు. అయితే వరుస వరదలతో వృద్ధగౌతమి పాయ మునిగిపోవడంతో ముక్తేశ్వరం వృద్ధగౌతమి కొత్త వంతెనకు వెళ్లే రహదారి పక్కనే అంత్యక్రియలు చేస్తారు. సోమవారం తొత్తరమూడికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు వంతెన వద్ద రహదారి పక్కనే ఆమె బంధువులు చేశారు.

డిమాండ్లు పరిష్కరించాలని నిరసన

మామిడికుదురు: ఓయన్‌జీసీ అధికారులు గతంలో ఇచ్చిన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పాశర్లపూడిబాడవలో స్థానికులు సోమవారం నిరసన చేపట్టారు. ఓయన్‌జీసీ డ్రిల్ సైట్ ఎదురుగా టెంట్ వేసి నిరసన తెలిపారు. తమకు పంట నష్ట పరిహారం చెల్లించాలని, మూడు నెలల క్రితం ఓయన్‌జీసీ చేసిన బాంబింగ్ వల్ల ఇళ్లు బీటలు తీశాయని దానికి పరిహారం ఇస్తామన్న హామీ కూడా నెరవేర్చలేదన్నారు. స్కూల్ విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వాలని, డ్రైనేజ్ నిర్మించాలని, బీటలు తీసిన గృహాలకు పరిహారం అందించాలని, శ్రీరామ్‌పేటలో వాటర్ ట్యాంకు నిర్మించాలని డిమాండ్ చేశారు. తరచు గ్యాస్, ముడిచమురు లీకేజీలు ఏర్పడుతున్నాయని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో స్థానికులు బిరుదుగంటి నరసింహమూర్తి, ఉప్పె శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ

ఆలమూరు: మండలంలోని జొన్నాడ నుంచి కపిలేశ్వరపురం వెళ్లే ఏటిగట్టు రోడ్డులో సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ జరిగింది. స్థానిక ఎస్సై జి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం బైక్స్, నాలుగు చక్రాల వాహనాలను ఆపి విస్తృత తనిఖీలు నిర్వహించారు. అలాగే రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. రహదారి నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచనలు చేశారు.

నకిలీ కురుకురే ప్యాకెట్లను అరికట్టాలి

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో సరఫరా జరుగుతున్న కురుకురే ప్యాకెట్లను అరికట్టి చిన్నారుల ఆరోగ్యాన్ని సంరక్షించాలని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం కార్యదర్శి కొడమంచిలి హరీష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పరిపాలన అధికారి మెహెర్ ప్రకాష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

విద్యావర్షిణి.. నమోస్తుతే..

- సరస్వతీదేవిగా అమ్మవార్ల అలంకరణ
- భక్తిశ్రద్ధలతో విద్యార్థుల పూజలు
- అధిక సంఖ్యలో భక్తుల దర్శనం

కొత్తపేట: 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ ఆ చదువుల తల్లి సరస్వతీ దేవికి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా సమస్త చదువులనూ కటాక్షించే సరస్వతీదేవిగా పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సరస్వతీ పూజలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరలిరావడంతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక బొరుసువారి సావరంలో ఉన్న విజయకనక దుర్గాదేవి ఆలయం భక్తులు, విద్యార్థులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకుడు బిక్కవోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితుడు, బ్రహ్మశ్రీ అనంతలక్ష్మణ కుమారాచార్యులు అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి విద్యాసంస్థల (ఏపీ, తెలంగాణ, బెంగుళూరు) చైర్మన్ సంతోష్‌రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాయంత్రం కుంకుమార్చన అనంతరం భాస్కర్- వసుధ దంపతులచే దుర్గామల్లేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వాడపాలెం జ్ఞానసరస్వతీ దేవి అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి రామచంద్రశర్మ అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారిని అర్చకుడు శ్రీనివాసుల రామచంద్రశర్మ కొత్తపేట గ్రామ దేవత బంగారమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు.

తూర్పుపాలెంలో అమ్మవారికి పూజ

మలికిపురం: దసరా ఉత్సవాల నేపథ్యంలో సోమవారం మండలంలోని తూర్పుపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో సరస్వతీ పూజలు ఘనంగా జరిగాయి. స్థానిక విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ఆలయాలకు భారీగా భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గామాత సోమవారం సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో విద్యార్థులు పెన్నులు, పుస్తకాలతో పూజలు నిర్వహించారు. ఆలమూరులో అతి ప్రాచీనమైన దేవాలయంగా భాసిల్లుతున్న శ్రీ బంగారు పాప (స్వర్ణబాల) ఆలయానికి భక్తులు పోటెత్తారు. మూలా నక్షత్రం ప్రత్యేకతను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు కాళ్లకూరి సూరిపండు వేద మంత్రోచ్చరణల మధ్య విద్యార్థులతో వారి తల్లిదండ్రులు పూజలు నిర్వహించారు.

మామిడికుదురు: దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి మూలా నక్షత్రం కావడంతో సరస్వతీదేవి పూజ ఘనంగా నిర్వహించారు. సరస్వతీదేవి పూజలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. పాశర్లపూడి బాడవ కనకదుర్గమ్మ ఆలయం, మామిడికుదురు విజయదుర్గమ్మ, పెదపట్నంలంక దుర్గమ్మ, ఈదరాడ, మగటపల్లి, పెదపట్నం, అప్పనపల్లి గ్రామ దేవత శ్రీకనకమహాలక్ష్మమ్మ ఆలయంలో చైర్మన్ తులా నాగరాజు ఆధ్వర్యంలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజ జరిపించారు.

అంబాజీపేట: దేవీ శరన్నవరాత్రుల వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా జరుగుతున్నాయి. మూలా నక్షత్రం కారణంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. మండలంలోని మాచవరం గ్రామదేవతలైన ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయం వద్ద అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. వేద పండితులు సుసర్ల కళ్యాణ్ శర్మ బ్రహ్మత్వంలో సరస్వతీ దేవి పూజ నిర్వహించి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. స్థానిక పశువుల మార్కెట్‌లో ఉన్న శ్రీవిజయ కనకదుర్గ, భక్తాంజనేయ స్వామివార్ల ఆలయం వద్ద సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్య సుబ్రహ్మణ్య శర్మ సారథ్యంలో యలమంచిలి సుబ్రహ్మణ్య శర్మ బ్రహ్మోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ప్రీతికరమగు చండీ హోమం జరిపించారు. శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి లడ్డూను మాచవరానికి చెందిన శీలం శ్రీనివాసరావు రూ.17 వేలకు వేలంలో దక్కించుకున్నారు.

పి.గన్నవరం: దసరా మహోత్సవాల సందర్భంగా పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం వైభవంగా సరస్వతీ దేవి పూజలు జరిగాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొని సరస్వతీ దేవి వ్రతాలు ఆచరించారు.



సరస్వతీదేవిగా కొత్తపేట బి.సావరం విజయ కనకదుర్గాదేవి



పి.గన్నవరం తాటికాయల వారి పాలెంలో సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ



అయినవిల్లిలో సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

పూజల అనంతరం విద్యార్థులకు అమ్మవారి చిత్రపటాలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. కనకదుర్గమ్మ సోమవారం భక్తులు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక ఏజీ రోడ్డులోని శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయం, గరుడేశ్వరాలయాల్లో విద్యార్థులచే సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

అయినవిల్లి: శరన్నవరాత్రుల్లో భాగంగా ముక్తేశ్వరంలో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరిపారు. అలాగే విలస, సిరిపల్లి, తొత్తరమూడి, నేదునూరు, పోతుకుర్రు, క్రాప, మాగం తదితర గ్రామాల్లో అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని కానుకలు మొక్కుబడులు చెల్లించారు.

అయినవిల్లి: ప్రసిద్ధగాంచిన విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం సరస్వతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా 240 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు మొక్కుబడులు చెల్లించారు. స్వామివారికి సోమవారం ఒక్క రోజు ఆదాయం రూ.4,79,526లు ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



తూర్పుపాలెంలో సరస్వతీదేవి పూజ చేస్తున్న విద్యార్థులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి చింతలపూడికి చెందిన దుర్గా శ్రీవెంకట కార్తీక్ సోమవారం రూ.10,116లు అందజేశారు. ఈ సొమ్ము ఆలయ అర్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

డిజిటల్ బుక్‌తో రెడ్‌బుక్‌కు చెక్

మామిడికుదురు: రెడ్‌బుక్‌కు చెక్ పెట్టి కూటమి వల్ల ఇబ్బంది పడిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు న్యాయం చేసేందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి చెప్పారు. పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద సోమవారం మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. తప్పుడు కేసులు పెట్టి పార్టీ నేతలను, కార్యకర్తలను కూటమి వేధిస్తోందని ఆమె మండిపడ్డారు. అధికారం ఉంది కదా అన్న అహంకారంతో విర్రవీగుతున్నారని, అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని కూటమి నేతలు తెలుసుకోవాలన్నారు. ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరికీ తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పని చేయాలని సూచించారు. పార్టీ ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుజ్జిబాబు, జక్కంపూడి వాసు, తులా గోపాలకృష్ణ, గెద్దం ఏసుదాసు, యేడిద లక్ష్మణ్, ఆగాబాకర్ హుస్సేన్, జోగి రామకృష్ణ, మట్టపర్తి శివ, విప్పర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పాశర్లపూడిలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరిదేవి

దళిత సంక్షేమాన్ని విస్మరించిన కూటమి

రాజోలు: దళిత సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం తాటిపాకలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు అధ్యక్షతన ఎస్సీసెల్ సమావేశం జరిగింది. సమావేశంలో గొల్లపల్లి మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఈనెల 30న అమలాపురం జిల్లా హెడ్‌క్వార్టర్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మెమోరాండం సమర్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మామిడికుదురు సెంటరుకు చేరుకోవాలని, అక్కడి నుంచి ఈదరపల్లి వంతెన వరకు ర్యాలీగా వెళ్లాన్నారు. ఎస్సీ సెల్ నాయకులు తాడి సహదేవ్, గుర్రం జాషువా, చిత్రపు కిషోర్‌చెన్నారెడ్డి, జిల్లెళ్ల వినోద్, మందపాటి మధు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ సెల్ సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

నాడు - నేడు భవనాలు పూర్తి చేసేదెప్పుడు?

కొత్తపేట: నాడు- నేడు పథకం కింద చేపట్టిన స్కూలు భవనాలు ఎప్పుడు పూర్తి చేస్తారు? అని ఎంపీపీ మార్గన గంగాధరరావు విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో ఎంపీపీ గంగాధరరావు అధ్యక్షతన జరిగింది. విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా ముందుకు సాగని స్కూలు భవనాల నిర్మాణం గురించి అడిగారు. దానిపై ఎంఈఓ-2 లీలావతి సమాధానం ఇస్తూ ఫేజ్-1లో మంజూరైన స్కూలు భవనాలకు ఎప్పటికప్పుడు నిధులు విడుదల కావడంతో కరోనా కష్టకాలంలో సైతం నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, ఫేజ్-2 వచ్చేసరికి విద్యా వ్యవస్థలో మార్పులు, గ్యాప్‌లు రావడం, కమిషనర్ ఉత్తర్వుల కారణంగా పనులు నిలిచాయన్నారు. కమిషనరేట్ నుంచి మళ్లీ ఉత్తర్వులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. బిళ్లకుర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు మాట్లాడుతూ, పంచాయతీల వీధి లైట్లకు సంబంధించి రీడింగ్ తీయకుండా గంపగుత్తగా బిల్లు పంపించి చెల్లించమంటున్నారు. పైగా ఎన్నో ఏళ్ల పెండింగ్ బిల్లులు మేమెందుకు చెల్లిస్తామని విద్యుత్ శాఖ ఏఈని ప్రశ్నించారు. కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి కూడా అదే అంశంపై మాట్లాడుతూ, 2016లో ఎల్ఈడీ బల్బులు వేశారని, అవి పగలు, రాత్రి వెలుగుతూనే ఉన్నాయన్నారు. పంచాయతీ నిధులను కరెంటు బిల్లులకే కేటాయించాలా? అభివృద్ధి పనుల కోసం చేపట్టాలా? అని ప్రశ్నించారు. దానిపై ఎంపీడీఓ నరేష్‌కుమార్ మాట్లాడుతూ, మీ రికార్డులు పరిశీలించి ఆర్థిక సంవత్సరాల వారీగా బిల్లులు పంపించండని సూచించారు. మండలంలో ఉన్నతి, స్త్రీనిధి రుణాలను లబ్ధిదారులకే ఇస్తున్నారా? అవి రెగ్యులర్‌గా వసూలు అవుతున్నాయా? అని సర్పంచ్ లక్ష్మీపతిరావు సంబంధిత ఏపీఎంను ప్రశ్నించారు. ఉన్నతిపై జిల్లా దిశ మీటింగులో తాను ప్రస్తావించడంతో కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే ఉన్నతి బకాయిలపై సర్వే జరుగుతుందని ఎంపీపీ తెలిపారు. స్త్రీనిధి రుణాలకు సంబంధించి పంచాయతీల వద్ద యానిమేటర్లతో సమీక్షించాలని సర్పంచ్‌లకు సూచించారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపేట మండల పరిషత్ సమావేశంలో సమీక్షిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

విద్యార్థుల ఆర్థిక భరోసాకు సహకరించాలి

అంబాజీపేట: జిల్లా పరిధిలో విద్యలో ప్రతిభ చూపిస్తున్న పేద కాపు విద్యార్థుల ఆర్థిక భరోసాకు కాపు నాయకులు సహకరించాలని రాష్ట్ర కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి శివప్రసాద్ కోరారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కాపు వర్గీయులు సోమవారం సమావేశమయ్యారు. శివప్రసాద్‌తో పాటు అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీలు మాట్లాడుతూ, కోనసీమ డివిజన్ పరిధిలోని విద్యలో ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్ రూపంలో అందించే నగదును సేకరించడంతో పాటు ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్‌లో ప్రతిభ కనబరిచిన పేద కాపు విద్యార్థులను గుర్తించేందుకు కేపీటీడబ్ల్యూఏ ముందుకు వచ్చిందన్నారు. అక్టోబర్ 5న అమలాపురంలోని శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా కొర్లపాటి రాజగోపాల్ రూ.25వేలు, మైపాల తాతాజీ రూ.25వేలు, సుంకర బాలాజీ రూ.25 వేలు, అరిగెల ఏసు రూ.25వేలు, ఉమా డెవలపర్స్ రూ.15 వేలు, గణపతి వీరరాఘవులు రూ.10 వేలను నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పప్పుల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాస్, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎంపీఏ వైస్ చైర్మన్ కొర్లపాటి పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆర్డీఓ శ్రీకర్ ఆదేశాలు



కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్

కొత్తపేట: గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ శ్రీకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆయన సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా, రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో అధికారులు ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో కాజ్‌వేలు తెగిన చోట పడవలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పడవలపై రాకపోకలు సాగిస్తున్న వారికి లైఫ్ జాకెట్లు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీసు శాఖల వారిని అప్రమత్తం చేశామని, హెచ్చరిక జెండాలు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో రాకపోకల పర్యవేక్షణ జరిగే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వివరించారు. వరదల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే ఆర్డీవో ఆఫీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8500238258కు సమాచారం అందించాలని ఆర్డీఓ సూచించారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

అయినవిల్లి: మండలంలోని లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. ముక్తేశ్వరం- కోటిపల్లిరేవులో వరద నీరు ఉధృతిగా ప్రవహిస్తుంది. ముక్తేశ్వరంలో వృద్ధ గౌతమీ పాయపై పాత వంతెన వరద నీట మునగడంతో పడవలపై ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు, వ్యవసాయ పనులు చేసుకునే వారు నీటిలో కాజ్‌వేపై ప్రయాణిస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో కూరగాయ పంటలు వరద నీట మునిగాయి. వరుస వరదలతో తీవ్రంగా నష్టపోయామని, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ముక్తేశ్వరంలో వరద నీటిలో నడుస్తున్న రైతులు

పి.గన్నవరం: మండలంలోని వశిష్ట, వైనతేయ నదీ పాయల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాలతో పాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనర్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతుండటంతో ఆ గ్రామ ప్రజలు పడవలపై వెళ్తున్నారు.



బూరుగులంకలో పడవలపై ప్రయాణిస్తున్న లంక ప్రజలు



అప్పనపల్లి కాజ్‌వేపై ఇబ్బందుల నడుమ రాకపోకలు

కాజ్‌వేను వీడని వరద

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. అప్పనపల్లి కాజ్‌వే ఇంకా వరద ముంపులోనే ఉంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు అప్పనపల్లి శ్రీబాలబాలాజీ దర్శనానికి వచ్చే భక్తులు సైతం ఇబ్బందులు పడ్డారు. శరన్నవరాత్ర ఉత్సవాలు కావడంతో అప్పనపల్లి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులు వరదలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పసుగ్రాసం ముంపు బారిన పడడంతో పశువులు ఆకలితో అలమటిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరో రెండు రోజులు వరద ఉధృతి కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సాగునీటి సరఫరాపై సమీక్ష

ఆలమూరు: తూర్పు డెల్టా ప్రధాన కాలువ పరిధిలో ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం సమీక్ష జరిగింది. ఆలమూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖాధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కోరంగి మెయిన్ కెనాల్ అధ్వానంగా ఉండటం వల్ల సక్రమంగా వరి చేలకు సాగునీటిని అందించలేకపోతున్నామని పలువురు ప్రతినిధులు ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కాలువల నిర్వహణలో విద్యుత్ శాఖ తీవ్ర నిర్లక్ష్యం వహించడం వల్ల వాటి నిర్వహణ మరింత భారంగా మారిందన్నారు. సాగునీటి సరఫరాలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆలమూరు, కపిలేశ్వరపురం, వెదురుమూడి తదితర ప్రాంతాల్లో పంట కాలువలను వారు పరిశీలించారు. ఎస్ఈని సాగునీటి సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. రామచంద్రపురం ఈఈ రామకృష్ణ, డ్రైన్స్ డిప్యూటీ ఇంజినీర్ పోచారావు, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్లు మెర్ల గోపాలస్వామి, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం పాలకవర్గ నియామకం

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమామందేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలిని నియమిస్తూ దేవాదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దేవస్థానం చైర్మన్‌గా ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అశోక్ గజపతిరాజు కాగా, సభ్యులుగా గందం సత్యవెంకటనాగాజీ, దంగేటి సాయినాగభూషణం, నల్లా మాచర్ల లక్ష్మి, నేరేడుమిల్లి మమాలక్ష్మి, గవర వీరవెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంతలక్ష్మిసావిత్రి, దేవపాటి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి నాగశిరోమణి, తణుకు వీరభద్రం, కముజు స్వప్నతో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి నియమితులయ్యారు.

మహిళల ఆరోగ్యం సమష్టి బాధ్యత

ఆలమూరు: మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం అందరూ సమష్టి బాధ్యతగా భావించి వారందరికీ సంపూర్ణ సహకారం అందించాలని కొత్తపేట ఎడిషనల్ డీఎంహెచ్ఓ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎం.సుమలత అన్నారు. మండలంలోని ఆలమూరు, మూలస్థానం, అగ్రహారం గ్రామాల్లో సోమవారం సర్పంచ్‌లు నేలపూడి లావణ్య, లంక వరప్రసాదరావు ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు ప్రత్యేక టీకాలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. అలాగే గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉండటంతో విధులకు దూరంగా ఉన్నారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈఓలు రాజా, బి.సూర్యనారాయణ. సూపర్‌వైజర్లు శివప్రసాద్, శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, ఆరోగ్య అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలమూరులో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

విధుల బహిష్కరణ

మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు విధులను బహిష్కరించారు. పీహెచ్‌సీ వైద్యుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న పక్షపాత వైఖరికి నిరసనగా సోమవారం నుంచి సమ్మె తలపెట్టారు. అందులో భాగంగా వైద్యులు పీహెచ్‌సీలకు వచ్చినప్పటికీ రోగులకు చికిత్సను అందించలేదు. అలాగే స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్, చంద్రన్న సంచార చికిత్స కేంద్రానికి హాజరుకాలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

మామిడికుదురు: జీఎస్టీ 2.0తో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుందని ఎంపీడీఓ బి.భవాని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జీఎస్టీపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ వల్ల ఏ వస్తువులపై ఎంత మేర ధరలు తగ్గాయో ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. ఈ బాధ్యత ప్రధానంగా వ్యాపారులపై ఉందని చెప్పారు. విద్యావంతులు, మేధావులు కూడా ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం దీనిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్, కూటమి నేతలు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం చేయాలి

అంబాజీపేట: జీఎస్టీ తగ్గింపు ఫలాలు అందరికీ తెలిసేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ బి.మమత అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, జీఎస్టీ 2.0పై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. జీఎస్టీ సంస్కరణ అమలులో భాగం ఆటోమొబైల్స్, పౌల్ట్రీ, అక్వా, రవాణా, నిర్మాణ, బీమా, కిరాణా మర్చంట్ తదితర వ్యాపార సంస్థల ప్రతినిధులంతా అవగాహనతో ప్రజలకు వివరించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఏఓ కె.ధర్మప్రసాద్, కొర్లపాటి గోపి పాల్గొన్నారు.